వ్యాస కౌముది



# తెలంగాణ సంస్థాన సాధనానంతరం పూసిన 'నిప్పుపూలు'

- డా.రాపోలు సుదర్శన్

ఆరంభం

దాశరథి ఎన్ని కథలు రాశారో తను ఎక్కడా చెప్పుకోలేదు, వీరు రాసిన కథల్ని డా. జలంధర్ రెడ్డిగారి సంపాదకత్వంలో వచ్చిన సంపుటంలో, నవచేతన పబ్లిషింగ్ హౌస్ వారు దాశరథిపై వెలువరించిన సంపుటాల్లోని ఒక దానిలో కథానికలు ముద్రితమైనై. ఇటీవల తెలంగాణ సాహిత్య అకాడమి వారు నవంబర్, 2024లో 'నిప్పుపూలు' శీర్షికన 13 కథలతో పుస్తకాన్ని తీసుకొచ్చారు. అందులో టైటిల్ కథనే ఈ 'నిప్పుపూలు'. ఈ కథ గురించి వివరించడం ఈ వ్యాస పరిధి.

ఈ కథానిక 'తెలుగు దేశం' పత్రిక 12-5-1949వ సంచికలో మొదటి సారి ప్రచురితమైంది. ఈ కథ అచ్చయ్యే నాటికి ఇరవై నాలుగేళ్ళయినా లేవు రచయితకు. ఈ కథ వీరి ముద్రిత లభ్య కథల్లో రెండవది. ఈ కథానిక కంటే తొమ్మిది నెలల ముందే 'అభ్యుదయ' పత్రిక ఆగస్టు 1948వ సంచికలో 'తెలంగాణా అమరవీరుని రక్తాంజలి!' అనే కథానిక అచ్చయింది. 'నిప్పుపూలు' అచ్చయిన సంవత్సరమే ఈ రచయిత తొలికావ్యం 'అగ్నిధార' పుస్తక రూపాన్ని ధరించింది.

ఇప్పటికి డెభ్బై ఆరేళ్ళ క్రితం రాయబడిన ఈ 'నిప్పుపూలు' కథలో నాటి తెలంగాణ స్థితిగతులు ప్రధానంగా చూపబడినై. ఎన్నో ఏళ్ళుగా ప్రజల పట్ల నిజాం రాజు, రజాకార్లు

దాష్టికాన్ని జరిపారు. ముఖ్యంగా రజాకార్ల ప్రవర్తనను ఈ కథారచయిత తమ స్వీయచరిత్రలో "రజాకార్ అంటే స్వచ్ఛంద సేవకుడు (వాలంటీరు). కానివారు చేసే సేవ హత్యలూ, మానభంగాలు, ప్రాచీన శిల్పాలను వికృతం చేయడం – ఇలాంటి దారుణ కృత్యాలు" (పుట–377, ప్రజాకవి దాశరథి సాహిత్యం–4 ) జరిపారని తెలిపారు. వీళ్ళ అమానుష ప్రవర్తనే ప్రజలు తిరగబడేట్లుగా చేసింది, సాయుధ పోరాటంగా మారింది. భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చి తన చుట్టుపక్కలో ఉన్న సంస్థానాలను తనలో కలుపుకుంటున్న తరుణమది. నిజాం తన దేశాన్ని భారతదేశంలో కలపడానికి ఇష్టపడకపోవడం వల్ల పోలీసు చర్యతో 17–9–1948 నాడు భారతదేశం తనలో కలుపుకుంది. ఇది జరిగిన ఎనిమిది నెలలకు ఈ 'నిప్పుపూలు' కథానిక ముద్రితమైంది.

ఇతివృత్తం

తెలంగాణ ఉద్యమ కాలంలో క్రూరమైన ఎందరో జాగిర్దారులు చంపబడ్డారు. ఇలా మరణించిన వారిలో 'అక్తర్‌జంగ్' ఒకరు. వీరి భార్య 'బేగం సాహిబా'. భర్త మరణాంతరం ఈమె అప్పటి పరిస్థితులను గమనించి, ప్రజలవైపు ఉండాలనుకుంటుంది. తన బంగళానొదిలి అప్పటి తమ ప్రాంతపు కాంగ్రెస్ నాయకులైన చంద్రం ఇంట్లో ఉంటుంది. హైదరాబాదులో జరగబోతున్న కాంగ్రెస్ సభలకు చంద్రం, ఆయన భార్య గౌరీ, వీరి ఇంట్లో ఉంటున్న బేగం సాహిబా హాజరుకావడానికి వెళ్ళడంతో కథ ముగుస్తుంది. ఇదీ ఇందులో ఇతివృత్తం. ఈ కథానిక ప్రథమ పురుషలో రచించారు రచయిత.

పాత్రలు

ఈ కథానికలో గౌరీ, బేగం సాహిబా, చంద్రం ప్రధానంగా కన్పించే పాత్రలు. వీరుగాక పనిమనిషి, అక్తర్‌జంగ్, గుంపులుగా ఘరానా స్త్రీలు, పేదఆడవారు, జాగీరు వంశీకులు, పట్నవాసులు, పెద్దలు మొదలైన వారి ప్రస్తావన ఉంది. ఈ కథానిక ప్రధానంగా గౌరీ, బేగం సాహిబాల చుట్టే తిరుగుతుంది. ఇప్పుడు ఈ పాత్రలను చూద్దాం.

**బేగం సాహిబా:** నిజాం నుంచి తెలంగాణాను విముక్తి చేసే పోరాటంలో నిజాం పక్షం ఉన్న జాగిర్దార్ అక్తర్‌జంగ్ మరణిస్తాడు. ఆయన ఆరవ భార్యనే బేగం సాహిబా. రచయిత దాశరథి ఈమె అనుభవాలను చెబుతూ పెద్ద భవనంలో ఉండడం, ఎత్తైన మెత్తని పరుపులు, విలువైన దుస్తులు, మంచి భోజనం,

తాంబూల సేవనం, రేడియో, కార్లు, నృత్యాలు, వందలాది మంది పరిచారికలు, అత్తరు, బురఖా, తెరలు, మొదలైన వాటన్నిటితోపాటు ముసలి మొగున్ని అనుభవిస్తూ ఆరితేరిన ముసలామెలా ఉందని ఈ పాత్రను పరిచయం చేశారు రచయిత.

బేగం సాహిబా తన భర్త మరణాంతర కాలం నాటి సమాజ మార్పులను గమనించి, తమ జాగీరు ప్రాంతాన్ని చూడ వస్తుంది. "... వెనకటి జాగీర్లలో చేసిన అత్యాచారాలకు ప్రజలంతా కోపగించుకున్నారు. ఇప్పుడు జమీందారు భార్య అన్నా, బంధువులన్నా జనాలకు కోపం! ఎంత తప్పుచేశారు మగాళ్ళు! వాళ్ళు సుఖపడి చచ్చారు. ఇప్పుడు బతికి వున్నవాళ్ళు కష్టపడి బ్రతకాల్సి వస్తున్నది" (పుట-9, నిప్పుపూలు) అని బాధపడుతూ "... మంచివాళ్ళు కాంగ్రెస్ వాళ్ళు. శాంతియుతమైన ద్వేషం వాళ్లది. వాళ్ళల్లోనే కలిసిపోయి జీవించడం మంచిది" (పుట-10, నిప్పుపూలు) అని భావించి ఆ ప్రాంతపు కాంగ్రెస్ నాయకుడైన చంద్రం గురించి వినడం, అతని భార్య గౌరీని చూసి ఆమె అందానికి ముగ్ధురాలై, తన బట్టలు ఇస్తుంది, ఉన్నతంగా అనుభవించినవేవీ తమను నిలబెట్టవనీ తలస్తూ ఉద్యమాలు చేసిన వాళ్ళందరూ నేడు రాజులవుతున్నట్లు తలచి డబ్బుల ఆశ చూపైనా 'గౌరీ' వాళ్ళను మంచి చేసుకోవాలనుకుంటుంది బేగంసాహిబా. వాళ్ళ ఇంటికి వెళ్ళి అక్కడే ఉంటుంది. సామాన్యుల్లో కలిసిపోయి సామాన్యుల లాగే జీవిస్తూ కలో, గంజో తాగే బతుకుతూ గౌరీ వాళ్ళతోపాటు కాంగ్రెస్ మీటింగ్ కొరకు హైదరాబాదు వెళ్తుంది. ఇలా సామాన్య ప్రజల మధ్య జీవించాలనుకుంటూ, కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపే పరివర్తన చెందిన పాత్ర బేగం సాహిబా.

**గౌరి:** ముస్లిం పాలకుల దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, తెలంగాణాను భారతదేశంలో కలవడానికి ఉద్యమించిన కాంగ్రెస్ నాయకుడు, ఈ ఊరికి పెద్ద అయిన చంద్రం యొక్క భార్య గౌరి. ఈమె గొడ్లు కాసే గొల్ల కులానికి చెందింది. చక్కగా పల్లెపాటలు పాడుకుంటూ పాలు పితుకుతుంది, బావి నుంచి నీళ్ళు తోడుతుంది, ఇలా పనులన్నీ చకచకా చేసుకుపోయే చురుకుదనమున్న ఈమె "పోక ముడిరైకె, చాలీచాలని చీరె, వూరికే భుజాన్ని జారిపోయే పైటచెంగు పీలికా, బిగుతైన రొమ్ము, నూనె లేక యెర్రబారిన జుట్టు, పచ్చని శరీరచ్ఛాయ, చిక్కని నలుపు కప్పిన కనుబొమ్మలూ, రెప్పలూ, కనపడని నడుం" (పుట-8, నిప్పుపూలు) తీరుతోఉన్న గౌరీ రూపురేఖల్ని అక్షరాలతో చిత్రించారు రచయిత. ఈ సౌష్టవం సాటి స్త్రీ అయిన బేగం మనసే చలించేంత అందగత్తె గౌరీ.
జాగిర్దారైన భర్త మరణించడం వల్ల కోరలు తీసిన పాముగ బేగంను భావిస్తూ, తన పట్ల చూపుతున్న దయా, ప్రేమకు తనలో జాలి ఏర్పడ్డది గౌరీకి. తన ఇంటికొచ్చిన బేగంను తన కుటుంబ సభ్యురాలుగా

మౌనంగా అంగీకరించింది. ఇలా తీర్చిదిద్దారు రచయిత గౌరి పాత్రను.

**చంద్రం:** కాంగ్రెస్ నాయకుడు. గౌరీ భర్త. గౌరిని బేగం సాహిబా పిలిపిస్తే రాదని చెప్పడమేగాక, ఆమె ఇచ్చిన వస్తువులను ఓ మూటకట్టి వచ్చిన మనిషికి తిరిగి ఇచ్చేయడం వల్ల, తేరగా వచ్చే దేనిపైనైనా ఆశ లేనివాడుగా చంద్రం పాత్ర చిత్రితమైంది.

ఇక మిగతా పాత్రలైన పనిమనిషి, జాగిర్దార్ అక్తర్‌జంగ్, గుంపులుగా ఘరానా స్త్రీలు, పేద ఆడవారు, జాగీరు వంశీకులు, పట్నవాసులు, పెద్దలు మొదలైన పాత్రలను గమనిస్తే రచయిత ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదని తెలుస్తుంది.

భాష

'నిప్పుపూలు' కథానిక 1949లో రాసినదైనా భాష నాటి పూర్తి వ్యావహారికంలో రాయబడింది. ఉదాహరణకు "...భర్త చనిపోవడం జాగీరు ప్రజలు జైళ్ళకు వెళ్ళి గెలుపుతో తిరిగిరావడం, జాగీరులో ఎన్నడూలేని మువ్వన్నెల జెండా చెట్టు తలల్లో యెగరడం ఇన్ని విశేషాలు జరిగాక బేగం సాహిబా జాగీరుకు రావడం మాత్రం జరగదూ!" (పుట-7) అంటూ నిశ్చయంగా జరుగుతదనే భావాన్ని కలిగించే రీతిగా వాక్య వ్యక్తీకరణ ఉంది. ఇది సగటు పాఠకులకు అర్థమయ్యేంత సుబోధనకంగా రాశారు రచయిత దాశరథి.

ఈ కథానిక "ఇళ్ళముందు 'పైడి తంగేళ్లు' పూయించుకుంటున్నారు. ఎంత అందంగా వుంటై తేలిక యెరుపు రంగులో పూలు! బంగళాలకు ముందర యెర్రని చీరలతో నాట్యంచేసే అప్సరసలాగ!" (పుట -7, నిప్పుపూలు) అనే వాక్యాలతో ఆరంభమై గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ముందు పెరిగే తంగేడు పూలం ఎర్రచీర ధరించిన నాట్యకత్తెల్లా ఉన్నాయనే వర్ణన ఉంది. 1942 ప్రాంతంలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ 'సెల్' సమావేశాలకు, 1944 నుంచి ఆంధ్ర మహాసభల్లో పాల్గొన్న రచయితకు 'ఎరుపు' రంగు పట్ల ప్రత్యేక అభిమానం ఏర్పడి ఉండడం వల్ల ఎర్ర పూలను ఎర్రచీరలతో పోల్చడమేగాక ఇంకా "...పడమర వైపు విచ్చుకొన్న బంగళా కిటికీలలోనించి ఎర్రటి సాయంత్రం కనబడుతున్నది. పడమర ఆకాశానికి అవతలగా ఎర్రగా పూచిన మోదుగుల గుంపు. తల మీద ముసుగు వెనక్కి తోసేసి చూచింది బేగం. తన యింటి ముందరి పైడితంగేడు యెన్నో రెట్లు యెరుపు! హైదరాబాదులో మహాళ్ళ ముందల యెరుపు, మరి పల్లెటూళ్ళలో సూర్యోదయం యెంత అందం! ఆ బారులుగా పూచిన మోదుగుల్లో యెంత

రంగు! మోదుగు మొగ్గల్లో చల్లారని నిప్పు. ముట్టుకున్నా కాలని ఆ చల్లని నిప్పుతో అరణ్యం యెంత అందంగా ఉంది!! ...” (పుట-7, నిప్పుపూలు) అంటూ ‘ఎరుపు’ను విశేషంగా చూపారు. ఇంకా ఈ వాక్యంలో కిటికీలు ‘తెరుచుకున్న’ అనే పదం వాడకుండా ‘విచ్చుకున్న’ అనే పద ప్రయోగం ఈ రచయితలో కవితనం కన్పింపచేస్తున్నది.

ఈ కథా రచయిత కవి కాబట్టి కథ చెప్పడంలో భాష ద్వారా మరింత సొబగులు అద్దారు. వాటిని చూద్దాం.

**కవితాత్మక వాక్యాలు:** దాశరథి ప్రధానంగా కవి కాబట్టి కథారచనలో కవితాత్మక వాక్యాలూ గమనిస్తాం. మచ్చుకు కొన్ని చూద్దాం.

“వెనకటి జాగీర్లలో చేసిన అత్యాచారాలకు
ప్రజలంతా కోపగించుకున్నారు
ఇప్పుడు జమీందారు భార్య అన్నా,
బంధువులన్నా జనాలకు కోపం!
ఎంత తప్పుచేశారు మగాళ్ళు!
వాళ్ళు సుఖపడి చచ్చారు
ఇప్పుడు బతికి వున్నవాళ్ళు
కష్టపడి బ్రతకాల్సి వస్తున్నది

సుఖపడి చావడం,
కష్టపడి బ్రతకడం.

సుఖపడి చావడం వాళ్ళవంతు,
కష్టపడి బ్రతకడం ప్రజలవంతు (పుట-9, నిప్పుపూలు) అనీ, మరో చోట
“... చిక్కగా ఆకాశం నిండా చుక్కలు బంగళాలోకి రానంత చల్లని గాలి,
పలచని చీకట్లలో చెట్ల తల విసురుళ్ళు. చిన్న చిన్న దీపాలు.
గాలి దెబ్బకు నాట్యంచేసే దీప జ్వాలలు”(పుట-11, నిప్పుపూలు) అనే విధంగా లయాత్మకంగా

రాశారు.

ఇలా వచనంలోఉన్న ఈ కథానికలోని పలుచోట్ల వచనాన్ని పంక్తులుగా పేరిస్తే అది కవితగా మారేంత కవిత్వాత్మకంగా వచనాన్ని రాశారు రచయిత దాశరథి.

**అలంకారాలు:** బాల్యం నుంచే కవిగా నిరూపించుకున్న దాశరథి కథల్లో ప్రాసలు పాయసంలో డ్రై ఫ్రూట్స్‌లా చదువరులను మరింతగా ఆకట్టుకుంటాయి, ఆకర్శిస్తాయి. ఉదా హరణకు "...గౌరి మాటలు, మోదుగుపూల తోటలు, చల్లగాలి పాటలు..." (పుట-12, నిప్పుపూలు) అనే వాక్యంలో చివర 'టలు' అనే వర్ణాలు వాడబడి చక్కటి అంత్య ప్రాస సాధించడం జరిగింది. ఇంకా "... ఎంత తప్పుచేశారు మగాళ్లు! వాళ్ళు సుఖపడి చచ్చారు. ఇప్పుడు బతికి వున్న వాళ్ళు కష్టపడి బ్రతకాల్సి వస్తున్నది"(పుట-9, నిప్పుపూలు) అనే ఈ వాక్యాల్లో 'ళ', 'ప', 'డ' అక్షరాలు ఆవృతి అవ్వడం; ఇలాగే "చిన్న చిన్న దీపాలు.
గాలి రెబ్బకు నాట్యం చేసే దీపజ్వాలలు" (పుట-11, నిప్పుపూలు) అనే వాక్యాలలో కొన్ని అక్షరాలు పలుమార్లు ప్రయోగింపబడి శ్రవణానందం కలిగిస్తాయి. ఇలా ఈ కథానిక చక్కగా అక్షరాలంకారాలతో అలంకరింపడినది.

**మంచి భావనాత్మక వాక్యాలు:** చక్కటి భావాన్ని పొదిగిన సందర్భోచిత వాక్యాలు ఈ కథకు అతకడమేకాదు, ఇంకెక్కడైనా వాడుకునేంత లోతైన భావంతో కొని వాక్యాలు దర్శనమిస్తాయి. అలాంటి వాటిల్లో "... ఎంత తప్పు చేశారు మగాళ్ళు! వాళ్ళు సుఖపడి చచ్చారు. ఇప్పుడు బతికి వున్నవాళ్ళు కష్టపడి బ్రతకాలిన వస్తున్నది" (పుట-9) అనీ; "... రానున్న కాలాన్ని గురించి అంతా ఆలోచిస్తే తల పగిలిపోయేటట్టుంది. సౌధాలు, సరదాలూ, సంతోషాలూ, సౌభాగ్యాలు నిలబెట్టలేవు" (పుట-10, నిప్పుపూలు) అనే విధంగా అణిముత్యాల లాంటి పలువాక్యాలు లభిస్తాయి ఈ కథానికలో.

**పోలికలు:** ఈ కథానికలో అక్కడక్కడ రచయిత చెప్పదలచిన అంశాన్ని పోలికతో చక్కగా పాఠకుడి హృదయానికి హత్తుకునే విధంగా చెప్పారు. అందులో మచ్చుకి ఒకటో రెండో చూద్దాం. "ఎంత అందంగా వుంటై తేలిక యెరుపు రంగులో పూలు! బంగళాలకు ముందర యెర్రని చీరలతో నాట్యం చేసే అప్సరసలాగ!" (పుట-7, నిప్పుపూలు) అని ఎర్రని పూలను ఎర్ర చీర ధరించిన అప్సరసలా ఉందని చెప్పడం ఎంతో సహజంగా ఉంది. మరోచోట "... మంచివాళ్ళు కాంగ్రెస్‌వాళ్ళు. శాంతియుతమైన ద్వేషం

వాళ్ళది. వాళ్లలోనే కలిసిపోయి జీవించడం మంచిది. ఇంకా యెదిరిస్తే విరిగిపోయిన కర్రకి మంట తగులుకున్నట్టు అవుతుంది" (పుట-10, నిప్పుపూలు) అని చెప్పడం వల్ల, ఇప్పటికే నిజాం రాజ్యం కూలిపోవడంతో అధికారంలో ఉన్న వాళ్ళ జీవితం విరిగిన కర్ర మాదిరి పనికి రానిదయ్యిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ వాళ్ళను ఎదిరిస్తే ఆ పనికి రాని కర్రకు కాస్త నిప్పంటుకొని బుగ్గి (బూడిద ) గా మారుతుందని జీవితాన్ని కర్రతో చక్కగా పోల్చి చూపారు రచయిత.

**చిన్న చిన్న వాక్యాలు:** చిట్టిపొట్టి వాక్యాలతో కథను ముందుకు తీసుకెళ్ళడంలో ఎంతో నేర్పరితనం కనిపిస్తుంది దాశరథిలో. అటువంటి వాటిగా "... చాలా చిన్న ఇల్లు, మట్టి గోడలు. ఎత్తు తగ్గుల నేల. నులక మంచం..." (పుట-11, నిప్పుపూలు) అనే వాక్యం; "బేగం పోలేదు. గౌరి పొమ్మన లేదు. చంద్రం వచ్చి ఏమీ మాట్లాడలేదు..."(పుట-11, నిప్పుపూలు) ఇటువంటివెన్నో చూపొచ్చు ఈ కథానికలో.

**నాటకీయత:** కొన్ని కథానికల్లో పాత్రల మధ్య మాటల్ని నాటకాల్లో మాదిరి ఉండడం, ఇంకా ఒక పాత్ర మాట్లాడుతున్నప్పుడు మరో పాత్ర ఏంచేయడం జరుగుతున్నదో రచయిత చెప్పడం గమనిస్తాం. ఉదాహరణకు "బేగం 'గౌరిని' చూచా నిర్ఘాంతపోయింది నిన్న చూచిన మోదుగుల్ని పైడితంగేళ్ళతో పోల్చి చూచుకుంది మళ్ళీ. తనని గౌరితో పోల్చి చూచుకుంది. మోదుగులు గెలిచినై గౌరీ గెలిచింది. (గౌరీకి ఖరీదైన దుస్తుల మీద దృష్టి లేదు. మేడ మీద ఆదరణ లేదు. గది గోడ నునుపును తాకుతో - తెల్లని తెర మీద బొమ్మ మాదిరి గోడకు ఆనుకుని అందంగా నుంచిని వుంది గౌరి). బేగం, గౌరి దగ్గరగా వచ్చి గభాల్న కావలించుకుంది" (పుట-8, నిప్పుపూలు) అని ఉన్న ఇందులో పాత్రలు, పరిసరాలు ఎలా ఉన్నాయో నాటక కర్త రాసే విధంగా ఈకథానికలో బ్రాకెట్లో వివరించారు కర్త అయిన దాశరథి.

ఇలాగే మరోచోట "ఈ దుస్తులు నువ్వే వుంచుకో. రేపు సాయంత్రము మళ్ళీరా" అంది ఉరుదులో బేగం . "ఈ జాగీర్లు పోతైలే. మా ఆయన ఈ వూరికి కాంగ్రెసు పెద్ద. నువ్వు పెద్ద కాదు" అంది గౌరి..." (పుట-9, నిప్పుపూలు) అని సంభాషణలు ఉంటాయి. ఈ విధంగా కొన్ని చోట్ల మంచి మంచి సంభాషణలతో ఈ కథానిక సంభాషణాత్మకంగా సాగింది.

**అక్షర ప్రయోగం:** ఇంకా ఈ కథానికలో 'ఎ'కారానికి బదులు 'య'కారం వాడకం గమనిస్తాం. ఉదాహరణకు ఎన్నో, ఎరుపు, ఎంత మొదలైన పదాల్ని "...పైడితంగేడు యెన్నో రెట్లు యెరుపు! ... పల్లెటూళ్ళలో సూర్యోదయం యెంత అందం!..." (పుట-7, నిప్పుపూలు) అని ఉపయోగించినట్లుగానే, వ్యావహారి

క భాషలో 'స' అక్షర వాడకాన్ని శిష్టవ్యావహారికంలో 'చ'గా వాడ్డం ఉంది. ఉదాహరణకు "బేగం గౌరీని చూచి నిర్ఘాంతపోయింది. నిన్న చూచిన మోదుగుల్ని పైడితంగేళ్ళతో పోల్చి చూచుకుంది మళ్ళీ. తనని గౌరితో పోల్చి చూచుకుంది…" (పుట-8, నిప్పుపూలు) ఇత్యాదిగా అక్షర ప్రయోగం ఉంది.

ఈ కథానికను రచయిత దాశరథి వ్యావహారిక భాషలో; కవితాత్మక చిన్న చిన్న పదాలు, వాక్యాలతో; అలంకారయుతంగా; అక్కడక్కడ సంభాషణాత్మక నాటక ఫక్కీలో రసరమ్యంగా తీర్చిదిద్దారు.

విశిష్టత:

ఈ కథ రాయబడి ఇప్పటికి డెభై ఐదు సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ విశిష్టంగానే ఉంది, కథాప్రేవిఎకులు తప్పక చదవదగినట్టుగా ఉంది. ఆ విశేషాల్ని చూద్దాం.

ఇది స్త్రీ ప్రాధాన్యత గల కథ. ప్రజలను హింసలపాలుచేస్తూ పాలించిన ఒకానొక తాబేదారు ప్రజాపోరులో ప్రాణాల్ని పోగొట్టుకున్న అతని ఆరవ భార్య అయిన బేగం సాహిబా నాటి వ్యవస్థను చూసి "… ఇంకా మంచివాళ్ళు కాంగ్రెసు వాళ్ళు. శాంతియుతమైన ద్వేషం వాళ్ళది…"(పుట-10, నిప్పుపూలు) అని అనుకోవడాన్ని 'ధర్మాగ్రహం'గా భావించిందని మనకు తెలుస్తుంది. తన భర్తగానీ నాటి అధికాం-న్ని అనుభవించిన మగవాళ్ళు చేసిన అమానుష పనులకు వాళ్ళ మీద ఆధారపడి జీవించిన స్త్రీలు "… పాపం ఆడది, మగాళ్ళు చేసే ప్రతి పాపానికి ఆడది బాధ్యురాలా! పాపం: విధవరాలు! మొగుడు పోయిన్నాటి నుంచీ చిక్కులే!…" (పుట-11, నిప్పుపూలు) అని బేగం సాహిబాపై ఓ రకమైన జాలి ఏర్పడుతఎంది పాఠకులకు. ఈ బేగం సాహిబా పాత్ర నాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకొని తన ఆస్తిపాస్తుల్ని వదిలేసి అప్పటి నాయక కుటుంబమైన గౌరి, చంద్రంల ఇంట్లో ఉండానుకొని వాళ్ళింటికెళ్ళి వాళ్ళ స్థాయిలోనే జీవితాన్ని గడుపుతుంటే, ఇది తెలిసి "బేగం పారిపోయిందన్నారు జాగీరు వంశీకులు. అవును పోయిందన్నారు పట్నవాసులు. చంద్రాన్ని వుంచుకుంది అన్నారు పెద్దలు. చంద్రం బేగంను ఎత్తుకొని పోయాడు అన్నారు పెద్దలు" (పుట-12, నిప్పుపూలు) ఇలా పలుగాకుల్లా లోకులు అనుకున్న సహజ విషయాల్ని రచయిత చెప్పడం విశేషంగా చెప్పుకోవచ్చు.

ఈ కథలో కొన్ని పాత్రలను, పల్లె-పట్టణాలను పువ్వులతో పోల్చి చూపుతారు రచయిత. అవి: "బేగం గౌరిని చూచి నిర్ఘాంతపోయింది. నిన్న చూచిన మోదుగుల్ని పైడితంగేళ్ళతో పోల్చి చూచుకుంది మళ్ళీ.

తనని గౌరితో పోల్చి చూచుకుంది. మోదుగులు గెలిచినై గౌరీ గెలిచింది" (పుట-8) అనే ఈ వాక్యాల్లో బేగం సాహిబా, గౌరీ పాత్రల్లో, బేగం  తనను తాను తంగేడు పూవుగా, గౌరీని మోదుగులతో పోల్చుకోవడమేగాక "బంగళాల ముందరి పైడితంగేళ్ళని వోడించిన మోదుగులు బేగం సౌందర్యాన్ని చిత్తుచేసిన గౌరీలోని అందం..."(పుట-10, నిప్పుపూలు) పూలతో తమ అందాన్నీ పోల్చడం గమనిస్తాం.

ఇలాగే నగరాన్ని, పల్లెలను తంగేడు, మోదుగులతో బేగం సాహిబా పాత్ర ద్వారా "...  మహళ్ళ ముందరి పైడితంగేళ్ళ రంగుల్ని వోడించే మోదుగుల్ని చూసేసరికి బేగం ఆశ్చర్యపడింది. నగర ప్రపంచంకంటే  విభిన్నమైన పల్లె ప్రపంచం కూడా ఒక విశేషమే అనుకుంది" (పుట-8, నిప్పుపూలు) అని వ్యక్తీకరింపజేసి, నగరాన్ని తంగేడుతో, పల్లెల్ని మోదుగులతో పోల్చాడు రచయిత దాశరథి. సాధారణంగా సౌమ్యానికి పూలను, స్త్రీలను  పోల్చడం కద్దు. కానీ ఈ కథానికలో దాశరథిగారు రెండు స్త్రీ పాత్రల మధ్య వ్యత్యాసానికి పూలను వాడుకోవడం విశేషంగా అనిపిస్తుంది.

దోపిడి:

వ్యవస్థలో పాలకులు పాలితుల్ని అన్ని రకాలుగా దోచుకొని, దాన్ని కర్మ సిద్ధాంతంతో  ముడిపెట్టి సరిపెట్టేవాళ్ళు. డార్విన్ పరిణామ సిద్ధాంతం, కమ్యూనిజం మొదలైన  వాటితో పరిచయం ఏర్పడ్డాక మన ఆలోచనల్లో మార్పు వచ్చింది. కార్యకారణ సంబంధాల్ని గూర్చి ఆలోచించడం మొదలుపెట్టాం. అలాంటి భావనలతో నిజాం పాలనను  చూసినప్పుడు రాజుతోపాటు ఆయన కింద ఉండే జాగీర్దార్లు, బంజరుదార్లు మొదలైన పాలకులు జనం సంపదను, శ్రమను పొందడాన్ని కర్మగా గాక దోచుకోవడంగా గుర్తిస్తాం. ఈ కథానికలో దాశరథి చూపిన దోపిడీని చూద్దాం.

"...జాగీర్దార్లు, బంజరుదార్లు హైదరాబాదు నగరంలో పైడితంగేళ్ళ (బంజరు) వెనక   మహళ్ళలో హుక్కాలు తాగుతూ 'జన్నతు'లా గడుపుతారు. జగత్తులో వాళ్ళది చాలా   సుఖవంతమైన జీవితం. ఎక్కడో  దూరాన ఏ జిల్లాలోనో, ఏ తాలూకాలోనో వుంటై వాళ్ళ జాగీర్లు. అక్కడ జనం యెన్ని బాధలుపడ్డా లక్షల మొత్తం సలక్షణంగా హైదరాబాదు   మహళ్ళకు చేరుకుంటుంది" (పుట-7) అని పల్లె ప్రజల ముఖ్యంగా రైతుల శ్రమ దోపిడిని ప్రత్యేకంగా ఎత్తి చూపాడు  దాశరథి. ఇటువంటి భావమే తన తొలి కవితా  సంకలనమైన 'అగ్నిధార' లో రైతులపై ప్రత్యేకంగా 'రైతుదే', 'రైతు' అని రెండు కవితలు రచించారు. అందులోని ఓ కవితలో "... మా / గాణములన్ సృజించి, ఎము / కల్ నుసిజేసి  పొలాలు దున్ని, భో /

షాణములన్ నవాబునకు / స్వర్ణము నింపిన రైతుదే, తెలం / గాణము రైతుదే..." (పుట–16, ప్రజాకవి దాశరథి సాహిత్యం–1) అని నిర్ధారణగా చెప్పడం చూస్తాం.

ఇలాగే మరోచోట "పదహారు జాల్లాలనూ దోచుకొని ఆ దోపిడితో శోభించే మహానగరంలో ఇంకేం విశేషాలు ఉంటాయి" (పుట–8) అంటూ హైదరాబాదులో ఉండే పాలకులు జిల్లాల సంపదను దోపిడీచేసి జీవించడం తెలిపారు రచయిత.

ఇంత స్పష్టంగా పాలకుల దౌర్జన్యాలను, దోపిడీలను దాశరథి గారు ఎలా తెలపగలిగారని మనం ఆలోచిస్తూ వారి జీవితాన్ని తరిచి చూస్తే వీరు కొంతకాలం కమ్యూనిస్టులతో పని చేశారు. జనంకోసం తన జీవితం అంకితం చేస్తూ కలిసి తెలంగాణ కోసం పోరాటంలో పాల్గొన్నాడు. సిపిఐ కార్యకర్త, అభ్యుదయ రచయితల సంఘం ఉర్దూ కవి అయిన మగ్దూం మొహియుద్దీన్‌తో పాటు సాహితీ సభల్లో పాల్గొన్నారు దాశరథి. మగ్దూం కవిత్వాన్ని తెలుగులోకి తర్జుమా చేసి ఎన్నో వేదికలపై వినిపించారు. ఇలా కమ్యూనిస్టుల్లో ఒకరుగా, సాహితీవేత్తల్లో ప్రముఖులుగా దాశరథి సమకాలీన సమాజ దోపిడీని తేటతెల్లం చేయగలిగారు.

బహుశా కమ్యూనిస్టు భావన వల్లనే ఎరుపంటే తనకు ఇష్టమన్నది ఈ కథ ద్వారా తెలుస్తుంది. ఈ కథలోని మొదట్లో "... బంగళా కిటికీలలోనించి <u>ఎర్రటి</u> సాయంత్రం కనబడుతున్నది. పడమర ఆకాశానికి అవతలగా <u>ఎర్రగా</u> పూచిన మోదుగుల గుంపు ..." (పుట–7, నిప్పుపూలు) అంటూ ఇందులో నాలుగు సార్లు 'ఎరుపు' పద ప్రయోగం చేశారు రచయిత. మరోచోట "... (గౌరీకి) కొప్పులో నాలుగు మోదుగు మొగ్గలు చెక్కింది. పడమటి ఆకాశం గౌరి కొప్పులో నవ్వింది" (పుట–9, నిప్పుపూలు) అని చెప్పడం వల్ల 'సాయంకాల సంధ్య' అయ్యిందని చెప్పకుండానే స్ఫురింపజేశారు రచయిత దాశరథి. ఇలా నిజాంపాలనలో దోపిడీని విశేషంగా చూపారు దాశరథి.

ఈ కథానికలో భార్యాభర్తలైన గౌరీ, చంద్రంలు 'గొడ్లు కాసుకునే గొల్లోళ్ళ' (పుట–10, నిప్పుపూలు) కులానికి చెందినవారుగానే ఎందుకు తెలుపబడ్డారని ఆలోచిస్తే, ఈ కథా రచయిత తమ స్వీయచరిత్రలో 'ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా 1944న వరంగల్‌లో ఏర్పాటైన కవిసమేళనానికి యాదవులు భోజనాలను సమకూర్చినట్టు తెలిపారు (ప్రజాకవి దాశరథి సాహిత్యం–4, పుట–378). ఇది తన మదిలో ఉండి ఈ కుల ప్రస్తావన చేసి ఉంటారని భావించే అవకాశం ఉంది. ఇది

యాదృచ్ఛికం కావచ్చు కాకపోవచ్చనే విశేషాన్ని ఊహించవచ్చు.

మహాకవి దాశరథి అంగారం, శృంగారం రెండూ పోషించారని సాహితీవేత్తలు చెబుతారు. ఈ లక్షణం 'నిప్పుపూలు' కథలో ఎలా ఉందో మొదట అంగారం, పిదప శృంగారం చూద్దాం.

భర్త చనిపోయాక తమ జాగీరులోకి వచ్చిన బేగం సాహిబాను పలుకరించడానికి వచ్చిన వారు "మంచి నీళ్లయినా తగకుండా వెళ్ళిపోయారు..." (పుట-8, నిప్పుపూలు) అనిచెప్పి బేగం ముస్లిం స్త్రీ అయినందు కు కూడా అక్కడ నీళ్ళు తాగలేదన్నట్టుగా రచయిత చెప్పారు, ఇంతేగాక ఈమె భర్త ప్రజలపట్ల ప్రవర్త న వల్ల కూడా కొందరైనా ఆగ్రహంతో నీళ్ళు తాగి ఉండకపోవచ్చని పాఠకులు ఊహించే అవకాశం ఉంది.

గౌరీని పిల్చుకురమ్మని పనిమనిషిని పంపితే "... గౌరిని బేగం రమ్మంటున్నదని విని ఇవతలికి వచ్చి 'రాదు పో' అన్నాడు. గౌరి మొన్న కట్టుకొచ్చిన విలువైన వస్తువుల్ని మూటకట్టి విసిరివేశాడు (వచ్చిన ) మనిషి మీద" (పుట-10, నిప్పుపూలు) అంటూ రచయిత చెప్పిన దాన్ని బట్టి చంద్రంకు తెలంగాణాన ం బాధ పెట్టిన పాలకులపై ఆగ్రహం ఇంకా చల్లారలేదనిపిస్తుంది. ఇక్కడ దాశరథికి కూడా వారిపై కోప ం తగ్గకపోవడం వల్లేఈ పాత్రల ప్రవర్తన ద్వారా తన అంగారాన్ని రచయిత ప్రదర్శించారని భావించవ చ్చు.

ఈ కథానికలో అక్కడక్కడ శృంగార వర్ణన గమనించగలం. గౌరిని చూసిన బేగం "పోకముడి రైకె, చాలీ చాలని చీరె, వూరికే భుజాన్ని జారిపోయే పైటచెంగు పీలికా, బిగుతైన రొమ్ము, నూనెలేక యెర్రబారిన జుట్టు, పచ్చని శరీరచ్ఛాయ, చిక్కని నలుపు కప్పిన కనుబొమ్మలూ, రెప్పలూ, కనపడని నడుం-గౌరి లో ఎంతో అందం!" (పుట-8, నిప్పుపూలు) అని భావిసుంది. తన ఇంటికొచ్చిన గౌరిని "... బేగం గబగబా పెట్టె తెరచి మంచి చీరె, రైక బైటికి తీసి గౌరిని తొడుక్కోమంది. గౌరి వద్దన్నట్టు తలవూపిం ది, బేగం బలవంతంగా గౌరి చీరె విప్పేసింది. గదిలో అద్దాల్లో గౌరి నగ్నంగా ప్రతిబింబించింది. పది అద్దాల్లో గౌరి శరీరాలు! బేగం గౌరిని బిగుత్తుగా కౌవిలించుకుంది... గౌరి పెదవుల్ని ముద్దు పెట్టు కుంది. కాళ్ళలో కాళ్ళు మెలవేసి నుంచుంది. పెదవుల్ని పెదవులతో వేడిగా పిండింది. గౌరి వంటినిండా అత్తరు రుద్దింది..." (పుట-9, నిప్పుపూలు) అని రచయిత బేగం ప్రవర్తనను కాస్త విచిత్రంగా చిత్రించా రు. హైదరాబాదులో జరుగబోతున్న కాంగ్రెస్ సభలను చూడబోతున్న సందర్భంలో బేగం "... సగం

కనపడే రొమ్ముతో యెగిరిపోతున్న పైటతో చిరిగిన చీరెతో రోడ్లమీద బహిరంగంగా నడిచే బేగంను యెవ్వరూ కన్నెత్తి చూడరు...” (పుట-12, నిప్పుపూలు) అని చూపారు దాశరథి. ఇలా ఈ కథలో శృంగారాన్ని రచయిత చూపడం విశేషం.

ఈ కథానికలో పూలూ, పాత్రలు పలు సందర్భాల్లో నవ్వడం గమనిస్తాం. వాటి విశేషాన్ని చూద్దాం.

గౌరి అందానికి ముగ్దురాలైన బేగం, గౌరికి “... కొప్పులో నాలుగు మోదుగు మొగ్గలు చెక్కింది. పటమటి ఆకాశం గౌరీ కొప్పులో నవ్వింది. గౌరీ పెద్దగా నవ్వింది” (పుట-9, నిప్పుపూలు) అనే ఈపంక్తులలో గౌరీ కొప్పులో బేగం చెక్కిన నాలుగు మోదుగులను పడమటి ఆకాశంలో ఉన్న ఎరుపు రంగులో ఉన్నట్టు చెప్పకనే చెప్పి, గౌరీ పెద్ద నవ్వును తెలిపి అప్పుడున్న పరిస్థితులు కాస్త ఆహ్లాదంగా, ఆనందంగా ఉన్నాయని తెలంగాణకు ప్రతీకగా గౌరీని చూపారు రచయిత అని ఊహించడానికి అవకాశం ఉంది.

నిజాం రాజ్యంలో అక్తర్‌జంగ్ ఒక జాగిర్దార్ (ఇతని భార్యే బేగం సాహిబా). అంటే పాలకుల్లో భాగం. రజాకార్లు స్వచ్ఛంద సేవకులు. ప్రజలపట్ల పాలకుల ప్రవర్తన కంటే ఘోరమైందనే విషయాన్నే చెబుతూ మధ్యలో ఏవిధంగా నవ్విందంటే “రజాకార్లు చెడ్డవాళ్ళు. వాళ్ళను వెళ్ళగొట్టాలి. మీరూ మేము వొక్కటి అంది బేగం. పెద్దగా నవ్వుతూ!...” (పుట-9, నిప్పుపూలు) అని గౌరితో అంటుంది బేగం. సాధారణంగా ఎదుటి వాళ్ళు నొచ్చుకోకుండా మన మాటల్ని ఒప్పించే విధంగా మాట్లాడేప్పుడు నవ్వుతూ మాట్లాడడం మానవ సహజం. అదే లక్షణం బేగం పాత్ర నవ్వులో విశేషం.

ఇంకో ఘట్టంలో “తన మేడ ముందుగా పోతూ పెద్దగా నవ్వింది బేగం!. పాలిపోయే యెరుపుతో పైడితంగేళ్ళు!! పల్లెలో చల్లని నిప్పు మోదుగులు, అందమైన గౌరి, గొప్ప చంద్రం, వీళ్ళే లోకం. ఈ పట్నాలన్నీ వొట్టి నాటకం! బేగం మళ్ళీ నవ్వింది. గౌరి జడలో మోదుగుపూలు నవ్వేయి” అని చెప్పడంలో ఏ మేడనైతే తను వదిలేసిందో ఆ మేడ ముందునుంచి పోతూ నిర్వేదంగా, నిట్టూర్పుతో కూడిన నవ్వును నవ్వింది బేగం. పట్నాన్ని పైడితంగేళ్ళు నివురుగప్పిన నిప్పులా ఉన్న ‘చల్లని నిప్పు మోదుగులు’ శక్తి వంతమైనవిగా, పాలకులుండే పట్నాలు ‘పాలిపోయే ఎరుపు’ వర్ణంలో ఉన్నవని అర్థంకావడం వల్ల నవ్విన నవ్వు రెండోది. ఈ కొటేషన్‌లో చివరి నవ్వైన ‘గౌరి జడలో మోదుగులు నవ్వడమ’ంటే తెలంగాణ విజయానికి, తెలంగాణ తనానికి ప్రతీకగా ఈ నవ్వును భావించొచ్చు.

ఇలా వివిధ సందర్భాల్లో పలు రకాల నవ్వులను పాత్రల ద్వారా నవ్వింపజేయడం ఈ కథానికలో విశేషం.

నామౌచిత్యం:
ఈ కథానికకు 'నిప్పుపూలు' అనే పేరుపెట్టారు రచయిత. వీరు ప్రధానంగా కవి. నిజాం అధీనంలో ఉన్న తెలంగాణ సంస్థాన విముక్తికై పోరాడిన యోధుడు. 1948 సెప్టెంబర్, 17 నాడు హైదరాబాదు సంస్థానం భారతదేశంలో మిళితమైంది. పోరాటంలో పాల్గొంటూనే జైలు జీవితం గడుపుతూ కూడా 'అగ్నిధార'గా కవిత్వాన్ని కుమ్మరించే అగ్నిగుండమైన కవి రాసిన కథానిక ఇది. తన దేశం భారతదేశంలో కలిసిన కాలంలో మరణించిన ఒకానొక ప్రాంతానికి ఒకానొక పాలకుడైన జాగిర్దార్ భార్య జీవితం, అప్పటి ఓ సామాన్య కాంగ్రెస్ నాయకుడు అతని భార్య జీవితమే ఇతివృత్తంగా తీసుకొని రాయబడిన ఈ కథలో ఇందులో ఎర్రని పూలైన పైడితంగేళ్ళు, మోదుగులను క్రమంగా పాలకులకు, ఉద్యమకారులకు ప్రతీకాత్మకంగా తీసుకున్నారు రచయిత. అంతేగాదు పట్నానికి, పల్లెకూ; అసహజ, సహజ అందగత్తెలైన బేగం సాహిబా, గౌరీలకు; పీడిస్తున్న, పీడింపబడుతున్న వారికి; అపజయానికి, జయానికి సింబల్‌గా కథలో చూపారు దాశరథి.

ఈ కథలో "... పైడితంగేళ్ళ రంగుల్ని వోడించే మోదుగుల్ని చూచేసరికి బేగం ఆశ్చర్యపడింది" (పుట-8 , నిప్పుపూలు) అని ప్రజా వ్యతిరేక పాలకుల చర్యలకు అయిష్టంగానే తలొగ్గి ఉండే వారి భార్యల స్థితి, దుస్థితిగా మారిన పాత్ర చేత చెప్పించడం, ఆ పాత్ర "... వాటి పేరు 'నిప్పుపూలు' అని పెట్టుకుంది" అని రచయిత చెప్పడంలోనే మోదుగు పూలకు కొత్తగా పెట్టిన పేరు, తనలో అంతర్గతంగా ఉన్న కమ్యూనిజం కలరైన ఎరుపుతో సూచించే విధంగా ఉండడం వల్ల కూడా తను ఇష్టపడి ఈ పేరునే కథానికకు ఖాయం చేశారు రచయిత. ఈ కథానిక మొత్తంలో పల్లె, గౌరి, విజయం ఇత్యాది వాటికి ప్రతీకగా 'మోదుగులు' చెప్పబడడం, ఈ పూలకు కొత్తగా పేరిడిన 'నిప్పుపూలు' అనేది నూతనంగా, వినూతనంగా ఉంది కాబట్టి 'నిప్పుపూలు' అనే పేరే ఔచిత్యవంతమైంది.

ఆరంభ-ముగింపులు
సంప్రదాయంలోంచి ఉద్భవించిన అభ్యుదయవాది అయిన దాశరథి 'కొత్తపాతల మేలు కలయిక'గా కనిపిస్తారు. కథానిక ఆధునిక ప్రక్రియే అయినప్పటికీ భారతీయ లక్షణ శాస్త్రాలు కావ్యాల ఆరంభ, ముగింపులు ఎలా ఉండాలో చెప్పిన 'మంగళాది, మంగళమధ్యాని, మంగళ అంతాని'ని ఈ కథలో దాశరథి పాటించినట్లు కన్పిస్తుంది. అది చూద్దాం.

ఈ కథానికను "ఇళ్ళ ముందు 'పైడితంగేళ్ళు' పూయించుకుంటున్నారు. ఎంత అందంగా వుంటై తేలిక యెరుపు రంగులో పూలు! బంగళాలకు ముందర యెర్రని చీరలతో నాట్యంచేసే అప్సరసలాగా!... " (పుట-7, నిప్పుపూలు) అనే వాక్యాలతో ఆరంభించారు రచయిత. పూల వర్ణనతో ఆరంభమైందన్నమాట ఈ కథానిక. కంటికి ఇంపు, మనసుకు ఆహ్లాదం కలిగిస్తాయి పూలు. అటువంటి పూలు, ఆ పూలు నాట్యం చేసే అప్సరసల పోలికతో ఉండడమంటే మంగళకరంగా ఆరంభింపడినట్టే ఈ కథానిక. ఇలాగే గౌరి అందానికి సమ్మోహనానికి గురై 'ముద్దుపెట్టుకుంది, కౌగిలించుకుంది, కాళ్ళలో కాళ్ళు మెలవేసింది, పెదవుల్ని పెదవులతో పిండింది, కొప్పులో మోదుగుల్ని చెక్కింది... బేగం సాహిబా. ఇలా ఈకథను మధ్యలో మంగళకరం చేశారు రచయిత. ఇక కథాంతాన్ని గమనిస్తే "తన మేడ ముందుగా పోతూ పెద్దగా నవ్వింది బేగం!. పాలిపోయే యెరుపుతో పైడి తంగేళ్ళు!! పల్లెలో చల్లని నిప్పు మోదుగులు, అందమైన గౌరి, గొప్ప చంద్రం, వీళ్ళే లోకం. ఈ పట్నాలన్నీ వొట్టి నాటకం! బేగం మళ్ళీ నవ్వింది. "గౌరి జడలో మోదుగుపూలు నవ్వేయి" (పుట-12, నిప్పుపూలు) అనే ఈ ముగింపు వాక్యాల్లో బేగం తను వదిలేసిన గత జీవితపు అవశేషాలైన మేడాదులు చూసి నిట్టూర్పుతో నవ్వడమేగాక, ప్రస్తుతం మోదుగులు, గౌరి, చంద్రంలే తన జీవితంగా తలంచి తృప్తిగా నవ్వుకోవడం; ఈ పరిణామంలో సాక్షమైన గౌరి జడలోని మోదుగులూ నవ్వడం; గౌరి, చంద్రంల సుఖ సంతోషాల్ని తెలియజేసే నవ్వుతో కథను ముగించారు రచయిత. ఈ విధంగా 'మంగళంతాని' చూస్తాం ఈ కథానికకు.

ముగింపు:

ఇలా ఈ కథలో తెలంగాణ సుదీర్ఘ పోరాటానంతరం భారతదేశంలో భాగమైన సందర్భంగా ఒక చిన్న జాగిర్దార్ భార్య, అక్కడ కాంగ్రెస్ వాళ్ళ జీవనం ఆధారంగా చారిత్రక అంశాన్ని కల్పనాత్మక కథానికగా అల్లి కోమలమైన పూవుల వంటి తెలంగాణ వాసులు, నిప్పుపూలుగా మారిన వైనాన్ని గుర్తుకు తెచ్చేంతగా 'నిప్పుపూలు' కథానికను అజరామరం చేశారు దాశరథి కృష్ణమాచార్య.

★★★

COMMENTS